

జూలై 20నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలోని నిరుద్యోగుల కోసం అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ విజయనగరం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ తెలిపారు. మొదటి దశలో రాత పరీక్ష, ఇందులో ఉత్తీర్ణులైన వారికి రెండవ దశలో శారీరక సామర్ధ్యం , వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాత పరీక్ష ఇప్పటికే పూర్తి అయ్యిందని, 10 వేల మంది ఈ ఆన్‌లైన్‌లో ఎంపికయ్యారని, వీరికి శారీరక, వైద్య పరీక్షలు విజయనగరం విటిసి గ్రౌండ్‌లో జరుగుతుందని అన్నారు. మంగళవారం కల్నల్ వినయ్ కుమార్ కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి అవసరమైన ఏర్పాట్లను, ఇతర లాజిస్టిక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులందరితో త్వరలోనే సమావేశం నిర్వహించి ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ర్యాలీలో పాల్గొను అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు ఇవ్వాలన్నారు. జెసి మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, డిఆర్ఒ గణపతిరావు, సెట్విజ్ సిఇఒ పాల్గొన్నారు.

పురుగు మందుల స్ప్రేయింగ్‌లో మరో అడుగు

- మండలానికి మూడు డ్రోన్ సిస్టమ్ హైరింగ్ సెంటర్లు
- 40శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు
- ఉచితంగా పైలెట్ శిక్షణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వ్యవసాయ యాంత్రీకరణలో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. దుక్కికోసం ట్రాక్టర్లు చాలా కాలం క్రితమే అందుబాటులోకి వచ్చాయి. గడిచిన దశాబ్దకాలంలో తేలికపాటి దుక్కికోసం మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, వరి కోత, కలుపుతీత, నూర్పిడి తదితరాలకు సంబంధించిన యంత్రాలు ఉనికిలోకి వచ్చాయి. వీటన్నింటినీ కలిపి కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరిట రైతుమిత్ర సంఘాలకు సబ్సిడీపై మంజూరు చేసిన విషయం విధితమే. ఇప్పటికే 326 ఆర్‌బికేల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఉన్నాయి. మరో 184 హైరింగ్ సెంటర్లను జూన్ 1న యంత్రసేవ పథకంలో భాగంగా రైతు మిత్ర బృందాలకు పంపిణీ చేయనున్నారు. సుమారు రూ.12కోట్ల మేర సబ్సిడీ అందనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదేమాదిరిగా పంటల సంరక్షణకు పురుగుల మందుల స్ప్రేయింగ్ కోసం డ్రోన్ సిస్టమ్ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు ప్రజాశక్తికి స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం తొలిదశలో రాష్ట్ర వ్యాప్తంగా మండలానికి మూడు చొప్పున డ్రోన్లు మంజూరు చేయనున్నారు. ఆర్‌బికె ద్వారా కనీసం ఐదుగురు సభ్యులు కలిసి దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక్కో డ్రోన్ విలువ సుమారు రూ.10లక్షలు కాగా, ఇందులో 40శాతం ప్రభుత్వం సబ్సిడీ రూపంలో చెల్లిస్తుంది. మిగిలిన మొత్తాన్ని సభ్యులు పెట్టుకోవాల్సి ఉంటుంది. వీరిలో ఒకరికి డ్రోన్ నడిపేందుకు ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం సుమారు అయ్యే రూ.75వేల ఖర్చును కూడా వారే భరిస్తారు. శిక్షణ పొందబోయేవారు రైతు అయితే కనీసం పదో తరగతి, భూమిలేనివారైతే డిగ్రీ విద్యార్హత ఉండాలని నిబంధన పెట్టింది. పాస్‌పోర్టు తప్పనిసరి. శిక్షణ పూర్తిచేసిన తరువాత కూడా కనీసం మూడేళ్లపాటు డ్రోన్ ఆపరేటింగ్ చేయాలని నిబంధన విధించింది. ఇప్పటికే జిల్లా నుంచి ఎనిమిది మంది దరఖాస్తు చేసుకుని శిక్షణకు కూడా వెళ్లారని అధికారులు చెబుతున్నారు. అన్ని మండలాల్లోనూ డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్లు అందుబాటులోకి వస్తే రైతులకు స్ప్రేయింగ్ సులభతరంగా కానుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పురుగుమందు పిచికారీ చేస్తున్న డ్రోన్

అర్హులందరికీ 'వాత్సల్య'

ఫ్యామిలీ డాక్టర్ పై గ్రామాలవారీగా షెడ్యూల్ ప్రకటించాలి


జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు



స్థాయి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

మిషన్ వాత్సల్య పథకం అర్హులందరికీ అందేలా చూడాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. సాంకేతిక కారణాలతో ఈ పథకం ఎవరికీ దూరం కాకూడదని స్పష్టం చేశారు. జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన 1,2,4,7 స్థాయి సంఘ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. 3వ స్థాయి సంఘ సమావేశానికి వైస్ ఛైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, 6వ స్థాయి సంఘ సమావేశానికి వైస్ ఛైర్మన్ కొర్లభారతి సింహాచలం, 5వ స్థాయి సంఘానికి ఆ సంఘం ఛైర్‌పర్సన్ బి.శాంతకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో వ్యవసాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వైద్యారోగ్యం, గృహ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. మిషన్ వాత్సల్య పథకానికి విజయనగరం జిల్లాలో సుమారు 14వేలు, పార్వతీపురం మన్యం జిల్లాలో సుమారు 9,500 దరఖాస్తులు వచ్చాయని, ఆయా జిల్లాల్లో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు తెలిపారు. కొన్ని రకాల ధ్రువపత్రాలను జత చేయకపోవడంతో, వీటిలో కొన్ని తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. అవసరమైన ధ్రువపత్రాలను జతచేయడానికి దరఖాస్తు దారులకు మరో అవకాశం ఇవ్వాలని ఛైర్మన్ శ్రీనివాసరావు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను ఆయా మండలాల ఎంపిడిఒలు, జెడ్‌పిటిసిలు, ఎంఎల్‌ఎలతోపాటు సచివాలయాలకు కూడా అందించాలని ఆదేశించారు. భర్త వదిలేసిన, విడాకులు తీసుకొని మహిళలకు విఆర్‌ఒ, లేదా ఇతర అధికారులనుంచి ధ్రువీకరణ తీసుకొని, దరఖాస్తులకు జతచేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం ద్వారా పేద ప్రజలకు మేలు చేకూర్చాలని ఛైర్మన్ కోరారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంపై మరింత విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నెల రోజుల ముందుగానే గ్రామాల వారీగా వైద్యులు వెళ్లే షెడ్యూలును ప్రకటించాలని ఆదేశించారు. వ్యవసాయ పరికరాలను ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడ కొనుక్కొనే అవకాశం రైతుకు కల్పించాలని ఛైర్మన్ కోరారు. ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను హేతుబద్ధీకరించాలని, అవసరమైన చోట కొత్త సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఐసిడిఎస్ అధికారులు తమకు సక్రమంగా సమాచారం అందించడం లేదని ఫిర్యాదు చేశారు. కొన్ని హాస్టళ్లలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు లేవని వాటిని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం, మన్యం జిల్లాల అధికారులు, జెడ్‌పిటిసిలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల నిరసన దీక్ష

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఒక్కరోజు రిలే నిరసన దీక్ష చేపట్టారు. ఎపిజిఇఒ సంఘం పిలుపు మేరకు రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని విజయనగరం జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ ప్రారంభించారు. తాలూకా అధ్యక్షులు డాక్టర్ భాగ్యరేఖ జిల్లా ఉపాధ్యక్షులు, వేపాడ ఎంపిడిఒ పట్నాయక్ పాల్గొన్న ఒకరోజు రిలే నిరాహారదీక్షకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎపిజిఇఒ జిల్లా అధ్యక్షులు పి.రామచంద్రరావు హాజరై మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోగా సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఎప్పటికప్పుడు డిఎ ఇస్తానన్న ముఖ్యమంత్రి నాలుగేళ్లయిన హామీ నెరవేర్చలేదు సరికదా పోలీస్‌లకు ఇచ్చిన జీవో వారాంతపు సెలవులు అమలు కూడా కాలేదన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు సకాలంలో ఇవ్వడంలోను, 1వ తేదీన జీతాలు చెల్లించడంలోను చొరవ చూపాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కె.ఆర్. సూర్యనారాయణ, జి. ఆస్కారరావు డిమాండ్ చేశారు. అక్టోబర్ 31 లోగా ప్రభుత్వం స్పందించకపోతే నవంబర్ 1వ తర్వాత ఏ రోజైన నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంది వెంకటరమణ, తాలూకా అసోసియేట్ ప్రెసిడెంట్ కె. శ్రీకర్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, చంద్రకుమారి, కె.చంద్రరావు, మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రమణ, సంయుక్త కార్యదర్శులు కె.మహేశ్వరరావు, గౌతమి, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పనగర్‌లో రోడ్లు వేయాలి

అక్రమ వాటర్ ప్లాంట్ రద్దు చేయాలి • పట్టణ పౌర సంక్షేమ సంఘం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోనిఒకటవ డివిజన్ పరిధిలోని అయ్యప్పనగర్ స్వామి లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం అపార్ట్‌మెంట్లు కాలనీస్ అసోసియేషన్ నాయకులు, యుఎస్ రవికుమార్, విజయనగరం పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేసారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ జనావాసాల మధ్య వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయ కూడదన్నది ప్రభుత్వ విధానమని, ఒకవేళ ఎవరైనా అధికారులను మభ్య పెట్టి, లేదా రాజకీయ పలుకుబడితో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే అది అక్రమమే అవుతుందని అన్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన వారు 5హెచ్‌పి లేదా ఆ పైన మోటారు వాడతారని, 500 అడుగులు ఆపైన లోతులో బోరు తవ్వి నీరును అమ్ముకుంటారని, దీనివల్ల చుట్టుపక్కల బోర్లన్నీ వేసవిలో ఇంకిపోతాయని తెలిపారు. వెంటనే అధికారులు కలుగ చేసుకుని అయ్యప్ప నగర్ స్వామి లేఅవుట్ లో ఉన్న అక్రమ వాటర్ ప్లాంట్ లను రద్దు చేయాలనీ లేదంటే ప్రజలే వెళ్లి మూయించాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే రహదారుల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయ్యప్ప నగర్ కార్యదర్శి సుధీర్, చౌదరి, అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అయ్యప్పనగర్ వాసులు, పిపిఎస్ఎస్ నాయకులు

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అభినందించిన జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు డాక్టర్ శ్రీరామ్మూర్తి చేపట్టిన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం స్ఫూర్తి దాయకమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి, స్వామి వివేకానంద ఆదర్శ నిర్మాణ్ సంస్థ, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు ఐదు వేల రూపాయలు స్కాలర్ షిప్ లను మంగళవారం అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చెర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరై స్కాలర్‌షిప్‌లు అందజేసారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది విడుదలైన పదో తరగతి ఫలితాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులే అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు సుముఖత చూపిస్తున్నారని, దానికి తగ్గట్టుగానే విద్యార్థులకు అన్ని మౌళిక సదుపాయాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. డాక్టర్ శీరామమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టగానే గొప్పవారు కాదని, వారు చదువుకున్న విద్య, కష్టపడే తత్వాన్ని బట్టి వ్యక్తులు గొప్ప స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మొత్తం 60 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో భూమాత రియల్ ఎస్టేట్ గ్రూప్ చైర్మన్ టి.పూర్ణ చంద్రరావు, వైసిపి పలాస ఇన్చార్జ్ పులిరాజు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, సాయి ఆసుపత్రి ఎమ్‌డి అక్కేన లక్ష్మీ పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ అందజేస్తున్నజెడ్‌పి చైర్మన్

ఖేలో ఇండియా పోటీల్లో రాజేశ్వరి పతకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల క్రీడా కారిణికి కాంస్య పతకం లభించింది. మంగళవారం ఉత్తర ప్రదేశ్ నోయిడాలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల బైరెడ్డి వీధికి చెందిన క్రీడా కారిణి బైరెడ్డి రాజేశ్వరి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధంచింది. 45కిలోల విభాగంలో రాజేశ్వరి స్నాచ్ 60కిలోలు, జర్క్ 79కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.




నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

భోగాపురం : మండలంలోని పలు అభివృద్ధి పనులకు బుధవారం ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ తెలిపారు. ముఖ్య అతిథులుగా విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు హాజరవుతారన్నారు. సవరవిల్లిలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్, చేపల కంచేరు సచివాలయ భవనం, ముక్కాంలో సచివాలయ భవనం, ముంజేరులో రైతు భరోసా కేంద్రం భోగాపురంలో బస్సు షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

జూన్ 30 నాటికి అభివృద్ధి పనులు పూర్తి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరం లో జరుగుతున్న అభివృద్ధి పనులు జూన్ 30 నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ . శ్రీరాములు నాయుడు ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్ లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డివిజన్ వారీగా ఎక్కడెక్కడ ఏయే పనులు జరుగుతున్నాయో, వాటి యొక్క స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు త్వరితగతిని పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సహకరించాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు ఎంత త్వరగా పూర్తిచేస్తే అంత త్వరగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని అన్నారు. నగరంలో అసంపూర్తిగా ఉన్న ప్యాచ్ వర్క్ లను పూర్తి చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్లకు సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కొత్తగా చేపట్టాల్సిన పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇఇ కె.శ్రీనివాసరావు, టెక్నికల్ అధికారి పట్నాల వెంకటేశ్వరరావు, ఎఇలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు పల్లవి ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక తోట పాలెంలోని సత్య డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సేనపతి పల్లవి జూలై 11 నుంచి 16 వ తేదీ వరకు ఢిల్లీలో జరగనున్న కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్‌లో 64 కేజీల సీనియర్ విభాగం, జూలై 28 నుంచి ఆగస్టు 5 వరకు ఇండియాలో జరగబోయే ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 64 కేజీల జూనియర్ విభాగాలకు ఎంపికైంది. ప్రస్తుతం పల్లవి సీనియర్ నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ కోచింగ్ క్యాంప్ లో పటియాలాలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ లో శిక్షణ పొందుతున్నది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశిభూషణరావు అభినందిస్తూ సత్య విద్యాసంస్థల తరపున పల్లవికి పౌష్టికాహారం నిమిత్తం రూ.30వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ పల్లవికి మంచి భవిష్యత్తు ఉన్నదని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ లో బాగా రాణించి దేశానికి, రాష్ట్రానికి, విజయనగరం జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలని ఆకాంక్షించారు.





ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

మోడీ తీరుపై దళితుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని ప్రధాని మోడీ ఆహ్వానించకపోవడాన్ని నిరసిస్తూ దళితులు మంగళవారం అంబేద్కర్ అందరివాడు సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు బొంగ భాను మూర్తి మాట్లాడుతూ ఈనెల 28న భారత నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవంలో భాగంగా భారతదేశ ప్రథమ పౌరురాలు, భారత రాష్ట్రపతి గిరిజన ,ఆదివాసి మహిళ అయినా ద్రౌపదీ ముర్మును పార్లమెంట్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం చాలా దారుణమని అన్నారభీ సందర్భంగా ప్రధానమంత్రి మోడీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక అధ్యక్షులు ఆదాడ మోహన్ రావు, ఉత్తరాంధ్ర అంబేద్కర్ రైట్స్ ప్రతినిధులు వెంకటరమణ, గంటా, వీర్రాజు, కార్పొరేటర్ పట్నాన పైడ్రాజు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ దయానంద్ శర్మ, ఎయిమ్ ప్రతినిధి లక్ష్మణరావు, రెల్లి కుల సంఘం ప్రతినిధి సోము లక్ష్మణరావు, అరుణ్ కుమార్, రాజ్ కుమార్, దాసరి గౌరీస్ తదితరులు పాల్గొన్నారు.


ఉపకులాలన్నీ ఐక్యంగా ఉండాలి

మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాదిగ ఉపకులాలన్నీ ఐక్యంగా ఉండాలని ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక రెవెన్యూ కళ్యాణ మండపంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మందకృష్ణ మాట్లాడారు. ఎస్‌సి వర్గీకరణ సాధించుకోవాలంటే అందరు కలిసి కట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. తాను ఏ రాజకీయ పార్టీకి మద్దతుగా వున్నా అందులో జాతి ప్రయోజనాలే కనిపిస్తాయన్నారు. అన్ని విధాలా వెనుకబడిన మాదిగలు 2024 ఎన్నికల్లో మన ఓటు మనకేఊ అనే నినాదంతో రాజకీయంగా ఎం ఎస్‌పిని అభివృద్ధి చేసుకోవాలన్నారు.

జిల్లా అధ్యక్షులు బోగిశ్రీను అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుబ్బారావు మాదిగ, ఉత్తరాంధ్ర జిల్లాలో ఇన్‌చార్జి బిశ్వాల్ మాదిగా తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మహిళా పక్షపాతి చంద్రబాబు

ప్రజాశక్తి -విజయనగరం కోట

మహానాడు సందర్భంగా టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపేట వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం చంద్రబాబు చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రసాదుల కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు మహిళల పట్ల ఎప్పుడు దర్మప్రాయంగానే ఉంటూ వారిని సముచిత స్థానంలో నిలబెట్టాలని అనేక సంక్షేమ పథకాలు తీసుకొస్తున్నారని అన్నారు. అందులో భాగంగా 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కుటుంబంలో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తాననడం గొప్ప విషయమన్నారు. చదువుకున్న ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15వేలు ఇస్తారన్నారు. జిల్లా పరిధిలో ప్రయాణించే ప్రతి మహిళకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని ప్రకటించడం అభినందనీయమని అన్నారు.కంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్ ధరను గుదిబండగా మార్చిన నేపథ్యంలో ఏడాదికి మూడు సిలెండర్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడం గర్వంగాఉందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో మహిళలంతా టిడిపికి మద్దతు పలకాలని కోరారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరా

విద్యుత్తుశాఖ ఎస్ఇ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ పర్యవేక్షక ఇంజినీర్ పి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గజపతినగరంలో ఏర్పడిన విద్యుత్ అంతరాయం గురించి స్పందిస్తూ ఈనెల 28న భారీ ఈదురు గాలులు, వర్షం కారణంగా 33 కెవి యుద్దనవలస ఎస్ఎస్‌లైన్ (33 కెవి గజపతినగరం ఫీడర్)పై తాటి చెట్లు నేలకూలడంతో రెండు స్తంభాలు దెబ్బతిన్నాయని తెలిపారు. దెబ్బతిన్న స్తంభాలను కొత్త స్తంభాలతో మార్పు చేసి సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల ఏదైనా విద్యుత్ అంతరాయం కలిగితే 1912కు ఫోన్ చేసిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఖరీఫ్ సన్నద్ధత పై శిక్షణ

గజపతినగరం : ఖరీఫ్ సన్నద్ధతపై ఏఎంసి ఏ. సిహెచ్ ధనలక్ష్మి ఆధ్వర్యంలో గజపతినగరం-2 ఆర్‌బికెలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు ద్వారా రైతులకు అందించే పథకాలు గురించి ఆమె వివరించారు. మట్టి నమూనాల సేకరణ, పచ్చిరొట్ట పైర్లు పెంపకం వల్ల కలిగే లాభాలు, చిరుధాన్యాలు పెంపకాన్ని ప్రోత్సహించడం, ఈ పంట నమోదు, వైఎస్ఆర్ యంత్ర సేవ పథకం, రాయితీ విత్తనాల పంపిణీ, ఆర్‌బికె ద్వారా ఎరువులు మందులు, ఎరువుల పంపిణీ, రైతుభరోసా, పంట సాగు హక్కు పత్రాలు, పంట కోత ప్రయోగాలు, అగ్రిలాబ్స్, పొలంబడి మొదలైన వాటి గురించి వివరించారు. జూన్ 2వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు ఆర్‌బికె పరిధిలో గల అన్ని గ్రామాలలోని వివిఏలు సమావేశం ఏర్పాటు చేసి రైతులకు వ్యవసాయ శాఖ నిర్వహించే అన్ని రకాల స్కీమ్స్ గురించి తెలియజేయాలన్నారు.

వడదెబ్బపై అవగాహన

కొత్తవలస: ఎండాకాలంలో డీహైడ్రేషన్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిహెచ్ఇఒ తిరుపతిరావు తెలిపారు. చియ్యం పేట పిహెచ్‌సి పరిధిలో గల తుమ్మికాపల్లి, సీతంపేట పరిధిలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ, వేసవి వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. వేసవిలో డీహైడ్రేషన్‌కి గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ సత్యారావు వడదెబ్బ పై అవగాహన కల్పించారు. జ్వరం, వాంతులు, కళ్ళు తిరగడం, విరోచనాలు అవడం, బీపీ డౌన్ అయ్యి ఒళ్ళు చల్ల బడటం వంటి లక్షణాలు కనబడితే వెంటనే నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లి బట్టలు వదులు చేసి గాలి తగిలేటట్లు చేసి మజ్జిగ గాని గంజి గాని, నిమ్మరసం గాని, గ్లూకోజ్ గాని తాగించాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

టిడిపి సంక్షేమ నిధికి రూ.లక్ష విరాళం

భోగాపురం: మహానాడు సందర్భంగా టిడిపి సంక్షేమ నిధికి తన వంతు చేయూతగా పార్టీ మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ రూ.లక్ష విరాళంగా అందించారు. రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో చంద్రబాబుకు చెక్కును అందించారు. పార్టీ బలోపేతంలో తన వంతు భాగస్వామ్యంగా ఈ చిన్ని విరాళాన్ని అందజేసానని తెలిపారు.

మాదక ద్రవ్యాల రవాణాకు చెక్

బొబ్బిలి: గంజాయి ఇతర మత్తు పదార్ధాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైహిమ్ అన్నారు. మంగళవారం వాహనాల తనిఖీతో పాటు రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో అనుమానితుల లగేజ్ లు తనిఖీ చేశారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల పాత బొబ్బిలి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు విస్తృతంగా చేశారు. గంజాయి ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్ధాలు రవాణా అవకుండా నిరోధించేందుకు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశామని ఆయన తెలిపారు.

ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి

వేపాడ: పార్లమెంటు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని పిలువకుండా అవమానించిన ప్రధానమంత్రి మోడీ ఆమెకు క్షమాపణ చెప్పాలని ప్రముఖ గాంధేయవాది, పాతల తూతా ఆతప ఉదయభాస్కర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి పార్లమెంటు భవనం ప్రారంభానికి అర్హురాలు కాదా అని ప్రశ్నించారు. పార్లమెంటు భవనాన్ని ప్రారంభించడానికి ఆమెను ఆహ్వానించకపోవడం సిగ్గుచేటన్నారు.

టైలరింగ్‌తో మహిళలకు మరింత ఆదాయం

నెల్లిమర్ల: టైలరింగ్‌తో మహిళలకు మరింత ఆదాయం పొందవచ్చని ఎస్‌బిఐ జిల్లా మేనేజర్ బి మార్టిన్ అన్నారు. వైఎస్‌ఆర్ ఎపి డిఆర్‌డిఎ ద్వారా డ్వాక్రా భవనంలో జరుగుతున్న 2వ బ్యాచ్ టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. శిక్షణ ఎలా జరుగుతుందని, సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేవా అని స్టూడెంట్స్‌ని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ అనంతరం ఏం చేస్తారని అడిగి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెళ్ళి కాని వారికి, వారి ఇంట్రెస్ట్‌ను బట్టి విజయవాడలో ఉద్యోగాలిప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎల్. సత్యనారాయణ, ట్రైనింగ్ టీచర్లు బి.నాగమణి, ఎస్.సునీత పాల్గొన్నారు.

నేడు బానాది శివాలయం ప్రథమ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో షణ్ముఖ సహిత దుర్గ మల్లికార్జునస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం నుండి యజ్ఞం, కుంకుమ పూజలు, పాలాభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం చేపట్టనున్నామని గ్రామ పెద్దలు గళ్ళ రామచంద్రుడు, గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి, కర్రి యశోద తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

శృంగవరపుకోట: హార్ట్ సంస్థ నిర్వహణలో మంగళవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎం. త్రినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్ట్ సంస్థ పేద ప్రజలకు సహాయం చేసేందుకు పనిచేస్తుందని అందులో భాగంగా హార్ట్ సంస్థ ప్రతినిధి బోని ఈశ్వరరావు, గ్రామస్థాయి కార్యకర్తల సహకారంతో పట్టణంలోని మహాత్మా గాంధీ పార్కు ఆవరణలో 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామని వెల్లడించారు.

గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్ వితరణ

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి శ్రీ గణేష్ జ్యువెలర్స్, అండ్ ఫర్నిచర్ హోమ్ అప్లయెన్సెస్, ప్రొపరేటర్ బి. శ్రీనివాస్ రూ.12 వేల విలువ చేసే వాటర్ డిస్పెన్సర్‌ను శాఖ గ్రంథాలయానికి బహుమతిగా అందించారని గ్రంథాలయాధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. పాఠకుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడే ఈ పరికరాన్ని దాత చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించామన్నారు.

ఘనంగా దేవాలయం ప్రతిష్ట

గరివిడి: మండలంలో వెదుళ్ళ వలస గ్రామంలో దశావతార సహిత శ్రీ రాధాకృష్ణ దేవాలయాన్ని మంగళవారం ప్రతిష్ఠించారు. ఆ గ్రామానికి చెందిన దుర్గాని సూర్యనారాయణ, దుర్గా భవాని దంపతులు దాతల సహకారంతో సుమారు రూ.80లక్షలు వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. మూడు రోజులు పాటు జరిగే ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా మంగళవారం సారు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీసారానంద సరస్వతి ఆధ్వర్యంలో ప్రత్యేక వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

కెడస్లాయ్‌తో 'సీతం' అవగాహన ఒప్పందం

విజయనగరం : జి -20 ఇండియా 2023 సదస్సు విశాఖపట్నంలో ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ క్రియేటివిటీ కాంక్లేవ్, వి 2.0 పేరుతో ఎర్త్ ఫౌండ్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో జరుగుతోంది. ఈ సదస్సుకు హాజరైన సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు, కెడస్లాయ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వికాల్ అరోరా మధ్య అవగాహన ఒప్పందం జరిగింది. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు కెడస్లాయ్ సిబ్బంది ఆధ్వర్యంలో అతిధి బోధనా తరగతులు నిర్వహిస్తామని, పారిశ్రామిక శిక్షణ, విద్యార్థుల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు తెలిపారు.

బొబ్బిలిలో ఫ్లెక్సీల రగడ

బొబ్బిలి: బొబ్బిలిలో ఫ్లెక్సీల రగడ ప్రారంభమైంది. చంద్రబాబు, లోకేష్ పక్కన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మోస్తున్నట్లు జెండామెల్ జంక్షన్‌లో వైసిపి మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు రియాజ్ ఖాన్ ఏర్పాటు చేశారు. జనసైనికులు మనోభావాలు దెబ్బతిని విధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను తొలగించాలని జనసేన నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా తొలగించేందుకు పోలీసులు వెనుకంజ వేసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ తొలగించకపోవడంతో జనసేన కార్యకర్తలు ఫ్లెక్సీ వద్దకు చేరుకుని ఫ్లెక్సీను తొలగించే ప్రయత్నం చేశారు. అక్కడకు పోలీసులు, వైసిపి నేతలు చేరుకోవడంతో ఫ్లెక్సీ తొలగింపునకు సిఎం జగన్మోహన్ రెడ్డి అవినీతి చిట్టాపై ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. వైసిపి ఫ్లెక్సీ తొలగిస్తేనే తాము ఫ్లెక్సీ తొలగిస్తామని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరు, గిరడ అప్పలస్వామి అన్నారు.

లచ్చింపేట మద్యం దుకాణంలో చోరీ

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామపంచాయతీ శివారులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో సోమవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆ దుకాణం సూపర్‌వైజర్ కుప్ప మహాలక్ష్మినాయుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీలకంఠాపురానికి చెందిన మహాలక్ష్మినాయుడు గడిచిన ఐదు నెలల నుండి ఆ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తనతో పాటు నీలంశెట్టి కుమార్, గనివాడ శివనారాయణ సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నారు. రోజువారీ అమ్మకపు సొమ్మును దుకాణంలోనే భద్రపరచి మరుసటి రోజు బ్యాంకులో జమ చేస్తుంటారు. అందులో భాగంగానే సోమవారం నాటి అమ్మకపు నగదు రూ.1.32లక్షలు భద్రపరచిన మంగళవారం చూసేసరికి నగదు మాయమైనట్లు సూపర్‌వైజర్ మహాలక్ష్మినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ ఎం ముకుందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం మంగళవార జిల్లాలోని పలుచోట్ల ఘనంగా జరిగింది. ఎల్‌బిజి భవనం వద్ద సిఐటియు జెండాను సీనియర్ నాయకులు ఎం.శ్రీనివాస ఆవిష్కరించారు. నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస మాట్లాడుతూ ఇంతవరకు కార్మిక వర్గం సాధించిన హక్కులన్నీ పోరాటాల ఫలితమేనని అన్నారు. 1970 లో దేశంలో సిఐటియు ఏర్పడి నప్పటినుండి ఐక్యత..పోరాటం. నినాదంతో కార్మిక హక్కుల సాధనకు కృషి చేస్తోందన్నారు. కార్మిక హక్కులపై నేడు బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని, పోరాడి వాటిని కాపాడుకోవాలని అన్నారు. మోడీఅధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ, కార్మిక చట్టాలను మార్చడం, 8 గంటల పని దినం రద్దు, అధిక ధరలు పెంచడం వంటి విధానాలు అవలంభిస్తున్నారని అన్నారు. మరోవైపు మోడీ పెట్టుబడి దారులకు అనుకూల విధానాలూ తెచ్చి దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెట్టే చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రశ్నిస్తే నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని అన్నారు. మత విశ్వాసాలు రెచ్చ గొట్టి ప్రజా స్వామ్యం, లౌకిక తత్వం రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాసే మోడీ విధానాలను కార్మికులంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్, జిల్లా కార్యదర్శి యుఎస్ రవికుమార్, అంగన్ వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పైడిరాజు, సిఐటియు నాయకులు త్రినాథ్, రెడ్డి శంకరరావు పాల్గొన్నారు

బొబ్బిలి: కార్మిక హక్కుల కోసం కార్మిక వర్గం ఐక్యంగా పోరాడాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు పిలుపునిచ్చారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మున్సిపల్ శానిటరీ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు వెంకట్ ఎగురవేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులపై దాడి చేస్తుందన్నారు. కార్మికుల హక్కులు పరిరక్షణకు కార్మికులు పోరాటం చేయాలన్నారు. సిఐటియు ఏర్పడినప్పటి నుంచి కార్మికుల



విజయనగరం : మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఎం. శ్రీనివాస

సమస్యలు పరిష్కారానికి పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. గ్రోత్ సెంటర్లో కార్మికుల సమస్యలు పరిష్కారానికి అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కార్మిక కర్షక వ్యతిరేక బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.వి రమణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విద్యుత్ జిల్లా స్టోర్స్ వద్ద సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సిఐటియు ఆవిర్భావం పై హమాలీలకు అవగాహన కల్పించారు. జెండా వద్ద రాబోయే రోజుల్లో కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన హమాలీలనుద్దేసించి మాట్లాడుతూ కార్మిక, కర్షక వర్గానికి తీరని ద్రోహం చేస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకు వచ్చి దేశ ప్రజలను నాశనం చేస్తుందన్నారు. కుల, మత రాజకీయాలు ప్రోత్సహించి పేద ప్రజానీకం మధ్య చిచ్చు పెట్టి లబ్ది పొందాలని చూస్తుందన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి కార్పొరేట్లుకు అప్పజెప్పి ప్రైవేటీకరణకు పాల్పడుతున్నా అధికార, ప్రతిపక్షాలు నోరు ఎత్తకుండా కార్మిక వర్గానికి ద్రోహం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జిల్లా స్టోర్స్ హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గజపతినగరం: సిఐటియు ఆధ్వర్యంలో గజపతినగరం హై స్కూల్ జంక్షన్ వద్ద సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు కె. కృష్ణ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి వి లక్ష్మి మాట్లాడుతూ 1970 మే 30వ తేదీన సిఐటియు ఆవిర్భావం జరిగిందన్నారు. అప్పటి నుంచి కార్మికులందరినీ సంఘటితం చేసి వారి హక్కుల కోసం పోరాటం చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా రైల్వే, బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి మొత్తం ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ ఐక్యం చేసి అనేక పోరాటాలు నడిపి విజయం సాధించిందన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులను ఐక్యంగా లేకుండా చేయాలని చూస్తోందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలకు కార్మిక వర్గమంతా ఐక్యంగా పోరాటాలు చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజు, కృష్ణ, గోవింద, ఏసు, నూకరాజు, వంశీ, గోవిందా తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపు కోట: సిఐటియు 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి మద్యల రమణ శానిటేషన్ సిబ్బందితో కలిసి సిఐటియు జెండాను ఆవిష్కరించారు. మండలంలోని వెంకటరమణపేట క్రషర్ల వద్ద క్వారీ కార్మికులతో కలిసి ఆయన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ కార్మికవర్గాన్ని ఒక వర్గంగా ఐక్యం చేయడానికి, ప్రజాతంత్ర పని విధానాన్ని స్వేచ్ఛగా అమలు చేసేందుకు, లొంగుబాటు ధోరణులకు వ్యతిరేకంగా 1970 మే 30న 'ఐక్యత-పోరాటం' అనే నినాదంతో సిఐటియు ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు ఎర్ర ప్రగడ భాస్కరరావు, డి. గణేష్ వై. భాస్కరరావు, కార్మికులు గంగరాజు శ్రీను, శివ, రేణుక, గౌరమ్మ, వెంకటరమణ,పేటక్వారీ వద్ద పోకల భాస్కర్, ఎస్ రామ సత్యం, బుల్లయ్య, గేదల కృష్ణ, గోకేడ శ్రీను, బి మహేష్, శేషు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: గరివిడి సిఐటియు ఆఫీసులో 53వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి ఏ. గౌరీ నాయుడు మాట్లాడుతూ 1970 మే 30వ తేదీన సిఐటియు స్థాపించబడిందన్నారు. ఈ 53 సంవత్సరాలు కాలమందు కార్మికుల హక్కుల కోసం నిరంతరం సమరశీల పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు, ఎందవ రమణ, సిఐటి నాయకులు సన్యాసినాయుడు, అప్పలనాయుడు, శ్రీరాములు పాల్గొన్నారు.



బొబ్బిలి: మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు



నెల్లిమర్ల: ప్రతిజ్ఞ చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : కోళ్ల

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. మహానాడు వేదికగా మహిళలకు మహాశక్తిలో భాగంగా మేనిఫెస్టోలో వరాల జల్లు కురిపించినందుకు గాను మంగళవారం పట్టణంలోని శ్రీనివాస కాలనీలో స్థానిక మహిళలతో కలిపి కుసుమహరనాథ్ గుడి వద్ద చంద్రబాబు చిత్రపటానికి ఆమె పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ18సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వరకూ ఇంట్లో ఎంతమంది మహిళలు అంత మందికీ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామనడం శుభపరిణామమన్నారు. ఒక ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తామనడం, ఏటా తల్లికి వందనంలో భాగంగా ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ ఏటా రూ.15వేలు చొప్పున మహిళల ఖాతాల్లో జమ చేస్తామని భరోసాను ఇవ్వడం ఇక్కడకి వచ్చిన మహిళాలు అందరూ చాలా సంతోషంగా



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కోళ్ల

ఉన్నారని ఆమె అన్నారు. జగన్మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు, ప్రత్యేక హోదా, మద్యపాన నిషేధం, 45 ఏళ్లకే పెన్షన్, 30 లక్షల ఇళ్ల నిర్మాణం, రూ.3వేలు పింఛను పెంపు, ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, సన్నబియ్యం సరఫరా, పేదలందరికీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇలాంటి హామీలన్నీ గాలిలో కలిపేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, నాయకులు బిశెట్టి అరుణ, గొర్లె కన్నతల్లి, దేవుపల్లి ప్రభ, గనివాడ లక్ష్మి పాల్గొన్నారు.

వాలంటీర్లే ప్రభుత్వానికి గుండె చప్పుడు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వాలంటీర్లే ప్రభుత్వానికి గుండు చెప్పడని వారి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని 2, 3 గ్రామ సచివాలయాలకు చెందిన వాలంటీర్ల సేవలకు పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వాలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నామన్నారు. ఈ వాలంటీర్ల వ్యవస్థ పై ప్రజల్లో మంచి స్పందన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, మండల పార్టీ అధ్యక్షుడు మోపాడ కుమార్, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, నాయకులు సింహాచలం, మజ్జి దేవి, బొడ్డేటి ఆదిలక్ష్మి, అడారి సూరిబాబు, భారతి, కృష్ణవేణి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సంక్షేమ వారధులుగా పనిచేస్తున్నారని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు అన్నారు. మండలంలోని పినతాడి వాడలో సేవలందిస్తున్న వాలంటీర్లను మంగళవారం ఆయన ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత చేరువవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినగిరి అచ్చంనాయుడు, మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, గ్రామ కార్యదర్శి జగదీష్, సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటల ద్వారానే చదువు ఇష్టం

విజయనగరం కోట : పిల్లలకు ఆటల ద్వారానే చదువు నేర్చుకోవడం ఇష్టమని గాజులరేగ శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం.లక్ష్మణ రావు కొనియాడారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో భాగంగా ముందుగా స్పోకెన్ ఇంగ్లీష్‌పై పిల్లలకు తర్ఫీదు ఇచ్చారు. అనంతరం పిల్లలను క్రీడల ద్వారా ఉత్సాహ పరిచి వారిని ఏ విధంగా చదువు వైపు తిప్పాలో తెలిపారు. విద్యార్థులకు స్వీట్‌లు, బిస్కెట్‌లు పంపిణీ చేశారు.

లక్కవరపుకోట: స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రారంభించిన వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు చదరంగం, క్యారంబోర్డు, వ్యాచరచన పోటీలు, సంగీతం, క్రాఫ్ట్ తదితర వాటిలలో శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం పేపర్ క్రాఫ్ట్‌ను నేర్పించారు. లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతుంది. ఇందులో భాగంగా మంగళవారం 60 మంది విద్యార్థులు పాల్గొని కథల పుస్తకాలు చదివారు. ఇందులో కొంతమంది విద్యార్థులు పేపర్ క్రాఫ్ట్ తయారు చేశారు. కొంతమంది నీతి కథలు చెప్పారు. లైబ్రేరియన్ మహేష్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వంద కుర్చీలు వితరణ

విజయనగరం కోట: స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఎన్‌విఎన్ నగర్ లోని శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయం కార్యదర్శి జి. శ్రీనివాస్ , ట్రెజరర్ ఎ.శివరామకష్ణ పాఠకుల వినియోగార్ధం 100 కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వారికి జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షులు ఆర్.పద్మావతి, కార్యదర్శి ఎన్.లలిత పాఠకుల తరఫున కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి. లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స రాక

విజయనగరం : రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం జిల్లాకు వస్తున్నారు. మధ్యాహ్నం 2గంటలకు కాకినాడ లో బయలుదేరి సాయంత్రానికి నగరంలోని తన నివాసానికి చేరుకుంటారు.

వ్యాపార ప్రదేశాల్లో సిసి కెమెరాలు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో ఉన్న వ్యాపారులందరూ వారివారి వ్యాపార ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని పోలీస్‌లకు సహకరించాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీధర్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ తిరుమలరావు ఆధ్వర్యంలో వర్తకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల దుఖానాల రక్షణ తో పాటు సమాజ పరిరక్షణ కూడా సాధ్యపడుతుందన్నారు. ఈ కెమెరాల ఏర్పాటు చేసేటప్పుడు షాప్‌తో పాటు బైట లోపల చుట్టూ కవర్ అయ్యేలా చూడాలన్నారు. మండల కేంద్రంలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తుందని దీనిని నివారణ వ్యాపార వర్గాల సహకారంతోనే సాధ్యం అన్నారు. ప్రతీ ఒక్కరూ రహదారి పై ఉన్న అక్రమణలు ఎవరికి వారే తొలిగించుకొని ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న దుఖానదారుల ఆక్రమణలు గుర్తించేందుకు రహదారి భద్రతా అధికారులతో త్వరలో సమావేశం నిర్వహించి ఎంతవరకు ఆక్రమణ జరిగింది గుర్తించి మార్కింగ్ వేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ సురేంద్ర నాయుడు, ఏఎస్ఐ అప్పారావు, చిన్నారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీధర్

మోసపూరిత హామీలను నమ్మొద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

టిడిపి అధినేత చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. అమరావతి పేదల ఇంటి స్థలాలను శ్మశాన వాటికతో పోల్చడానికి నిరసనగా మంగళవారం పట్టణంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు బూటకపు హామీలను ప్రకటించారని విమర్శించారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఆరు హామీలను కూడా అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, ఇంటికొక ఉద్యోగం ఇవ్వడంలో టిడిపి విఫలం కావడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, జెసిఎస్ కన్వీనర్లు రేజేటి విస్సు, రెడ్డి దామోదర్, నాలుగు మండలాలు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌కోట: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, కడుడండి, ఎమ్మెల్సీ ఇందుకూరి, తదితరులు

నాలుగేళ్ల పాలనపై సంబరాలు

అవినీతికి తావు లేకుండా ప్రజా సంక్షేమ పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టి నేటికీ నాలుగేళ్లు పూర్తి చేసుకోవడం అద్భుత సందర్భమని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం బొబ్బిలి పట్టణంలో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ వైసిపి శ్రేణులతో కలిసి భారీ కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి నేటితో నాలుగేళ్లు పూర్తవుతుందని ఈ నాలుగేళ్ల కాలంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందుకు సాగరన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ, మున్సిపాలిటీ, మండలాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, వార్డ్ కౌన్సిలర్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కోటలో బైక్ ర్యాలీ

శృంగవరపు కోట : రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలోని కొత్తవలసలో గల ఎమ్మెల్యే కార్యాలయం నుండి ఎస్ కోట దేవి కూడలి వరకు మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నాలుగేళ్ల పరిపాలనా కాలంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా లక్షల పైబడి పేదవాళ్లకు ఇళ్లస్థలాలతో పాటు ఇల్లు మంజూరు చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్ దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వెచలపు చినరాము నాయుడు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఐదు మండలాల ప్రజా ప్రతినిధులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, మండల పార్టీ అధ్యక్షులు, మండల జెసిఎస్ ఇన్చార్జిలు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా నాలుగేళ్ల పాలన

పూసపాటిరేగ : దిగ్విజయంగా నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగేళ్లు అయిన సందర్భంగా మండలంలోని నడిపల్లి గ్రామంలో కేక్ కట్ చేసి వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా రాష్ట్రంలో సువర్ణ పరిపాలన అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే సొంతమన్నారు. అనంతరం నడిపల్లి పెద్ద నడిపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, మండల జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, నాయకులు మహంతి జనార్దన్, పుప్పాల లక్ష్మీ నారాయణ, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, పాల్గొన్నారు.

దమ్ము, ధైర్యం ఉంటే ఒంటరిగా పోటీ చేయండి

వైసిపి ఆధ్వర్యాన పలుచోట్ల బైక్ ర్యాలీలు

గజపతినగరం: దమ్ము ధైర్యం ఉంటే టిడిపి ఒంటరిగా రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల పరిపాలనలో పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల బాధలను చూసిన జగన్ ఒక మేనిఫెస్టో ప్రకటించి అధికారంలోకి రాగానే వాటిని 98శాతం నెరవేర్చారన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు సచివాలయం ద్వారా 1.30 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా రెండు లక్షల మందికి ఉపాధి కల్పించామన్నారు. ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మరోసారి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు నాయుడు మేని(మాయ)ఫెస్టోని ప్రకటించారని ఎద్దేవాచేశారు. ఒంటరిగా పోటీ చేసే దమ్ము ధైర్యం లేక దత్త పుత్రుడుతో కలిసి అధికారంలోకి రావాలని ఎన్ని కుతంత్రాలు, కుయుక్తులు పన్నీన, ఎంతమందితో కలిసి వచ్చినా జగన్ వెంట్రుక కూడా పీకలేరని మండిపడ్డారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపటిసిలు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: రాష్ట్రంలో నాలుగేళ్ల ప్రజారంజక పాలన చారిత్రాత్మకం, సంచలనమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు, పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ ఎస్. బంగారునాయుడు, జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి.ఎస్.ప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాలనాపగ్గాలు చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నగరంలో వైసిపి శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. మంగళవారం కోలగట్ల వీరభద్ర స్వామి నివాసం వద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవశకానికి నాంది పలికే విధంగా నవరత్నాలను అమలు చేస్తూ, ప్రజలందరి మన్ననలను పొందుతున్న వైసిపి ప్రభుత్వం నాలుగేళ్లు పూర్తి చేసుకుందన్నారు. పథకాలు క్షేత్రస్థాయిలో అందుతున్నాయో తెలుసుకునేందుకు గడపగడపకు వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకోవడం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. వైఎస్ జగన్ పేరు చెబితే సంక్షేమ పాలన గుర్తుకొస్తుందని.. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పేరు చెబితే వెన్నుపోట్లు, నయవంచన గుర్తుకు వస్తుందని వారు విమర్శించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జిలు, కార్పొరేటర్లు, నాయకులు, పాల్గొన్నారు.